sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే



హైదరాబాద్ | 25-08-2026 మంగళవారం | సంపుటి-02 సంచిక : 136 EDITOR: ROHINI

ఇమ్రాన్ ప్రాణం... క్రికెటర్ల గళం

కటకటాల వెనుక క్రికెట్ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్



- మృత్యువుతో పోరాడుతున్న మాజీ ప్రధాని
- పాకిస్తాన్ ప్రభుత్వంపై గళమెత్తిన క్రికెట్ లోకం
- గవాస్కర్, కపిల్ వంటి క్రికెట్ దిగ్గజాల లేఖ
- క్రీడాస్ఫూర్తి చాటిన అంతర్జాతీయ దిగ్గజాలు
- జైలులో క్షీణిస్తున్న ఆరోగ్యంపై ఆందోళన
- కోర్టు ఆదేశాలు బేఖాతర్ చేస్తున్న పాక్

మైదానంలో పరుగుల కోసం పోటీ పడ్డ ప్రత్యర్థులు ఇప్పుడు ఒక మాజీ ఆటగాడి ప్రాణాలను కాపాడటం కోసం ఒక్కటయ్యారు. పాకిస్థాన్ క్రికెట్ లెజెండ్, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. రాజకీయాలు వేరు, మానవత్వం వేరు అనే నినాదంతో దాయాది దేశాల మధ్య రాజకీయ వైశమ్యాలను పక్కనపెట్టి దిగ్గజాలు రంగంలోకి దిగారు.

- సహనం వందే, న్యూఢిల్లీ

క్రికెట్ ప్రపంచంలో సువర్ణాధ్యాయం సృష్టించి 1992లో పాకిస్థాన్‌కు వరల్డ్ కప్ అందించిన ఆల్‌రౌండర్ ఇమ్రాన్ ఖాన్ రాజకీయాల్లోకి వచ్చి ప్రధాని స్థాయి వరకు ఎదిగారు. కానీ ప్రస్తుతం ఆయన జీవితం ఊహించని మలుపు తిరిగి కటకటపాల వెనుక గడపాల్సి వస్తోంది. అవినీతి ఆరోపణలు, దేశ రహస్యాల లీకేజీ, చట్టవిరుద్ధ వివాహం వంటి వివిధ కేసుల్లో 2023 నుంచి ఆయన జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఈ అభియోగాలన్నీ రాజకీయ కక్ష సాధింపు చర్యలేనని ఇమ్రాన్ ఖాన్ పార్టీ తీవ్రంగా ఆరోపిస్తోంది. గత కొంతకాలంగా జైలులో ఉన్న 73 ఏళ్ల వయసున్న ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందనే వార్తలు కలకలం రేపాయి.

క్రీడాలోకం ఆందోళన

ఇమ్రాన్‌కు తక్షణ వైద్య సాయం అందించాలని కోరుతూ గతంలోనే 14 మంది మాజీ కెప్టెన్లు పాకిస్థాన్ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాజాగా ఆ సంఖ్య 21కి చేరింది. ఇందులో మన దేశానికి చెందిన దిగ్గజాలు సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్ కూడా ఉండటం విశేషం. ఈ ప్రతిష్టాత్మక లేఖపై అలాన్ బోర్డర్, అలిస్టర్ కుక్, ఆండ్రూ స్ట్రాస్, అర్జున రణతుంగ, క్లైవ్ లాయిడ్, డేవిడ్ గ్లోవర్, దిలీప్ వెంగ్ సర్కార్, గ్రేగ్ చాపెల్, ఇయాన్ చాపెల్, జాన్ రైట్, కిమ్ హ్యూస్, లీ జెర్మన్, మైకల్ ఆర్థర్టన్, మైకల్ బ్రెస్లీ, నాస్సర్ హుస్సేన్, స్టీఫెన్ వో, ఆడమ్ గిల్‌క్రిస్ట్, అలెక్స్ బ్లాక్‌వెల్, బెలిండా క్లార్క్ తదితరులు సంతకాలు చేశారు. సరిహద్దులు, రాజకీయ విభేదాలకు అతీతంగా క్రికెట్ మైదానంలో ఏర్పడిన అనుబంధం తమను ఈ లేఖ రాసేలా ప్రేరేపించిందని వారు స్పష్టం చేశారు. తాము రాజకీయ నాయకులుగా కాకుండా మాజీ సహచరులు, ప్రత్యర్థుల హోదాలోనే ఈ విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

కీలక డిమాండ్లు

కోర్టు గతంలో ఆదేశించినట్లుగా ప్రతి వారం క్రమం తప్పకుండా కుటుంబ సభ్యులు ఇమ్రాన్ ఖాన్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వాలి. ఎలాంటి అడ్డంకులు ఈ నిబంధనను పకడ్బందీగా అమలు చేయాలని వారు కోరారు. వైద్య బృందం సూచించిన ప్రతి చికిత్సను ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ మొత్తం పరిణామాన్ని కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన ఆరోగ్య సమస్యగా మాత్రమే చూడలేమని విశ్లేషకులు భావిస్తున్నారు.

రాజకీయ ఉద్రిక్తతలు

పాకిస్థాన్ రాజకీయాల్లో ఇమ్రాన్ ఖాన్‌కు ఉన్న ప్రజాదరణ దృష్ట్యా ఆయన ఆరోగ్యంపై వస్తున్న ఆరోపణలు దేశంలో తీవ్ర అశాంతికి దారితీసే అవకాశం ఉంది. ఈ ఒత్తిడిని తగ్గించేందుకు దేశంలో రాజకీయ ఉద్రిక్తతలను చల్లార్చేందుకు ప్రభుత్వ వర్గాలు ఇమ్రాన్‌కు కొంతమేర వైద్య సదుపాయాలు కల్పించే రాజకీయ వ్యూహంలో భాగంగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్రికెట్ చరిత్రలో ఎంతో మంది దిగ్గజాలు తమ ఆటతో ప్రపంచాన్ని అలరించడమే కాకుండా, ఇలాంటి మానవతా దృక్పథం ఉన్న అంశాలపై స్పందించడం ద్వారా తమ గొప్పతనాన్ని మరోసారి చాటుకున్నారు. పాకిస్థాన్ ప్రభుత్వం మరియు న్యాయస్థానాలు ఈ క్రికెట్ దిగ్గజాల విజ్ఞప్తిని ఏ విధంగా స్వీకరిస్తాయనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

ఆయనే హీరో... ఆయనే విలన్

టాక్సిక్ సినిమాలో యష్ ద్విపాత్రాభినయం

- భారీ అంచనాల మధ్య రేపు విడుదల
- కమర్షియల్ హంగులకు అతీతంగా నటన

సినిమాల్లో బలమైన విలన్ లేకపోతే కథ ప్రభావం తగ్గిపోతుంది. అందుకే యష్ ఆ సమస్యను చాకచక్యంగా పరిష్కరిస్తూ టాక్సిక్ సినిమాలో హీరోతో పాటు విలన్ పాత్రను కూడా ఆయనే స్వయంగా పోషిస్తున్నారు. యష్ తీసుకున్న ఈ నిర్ణయం నటుడిగా ఆయన సాహసానికి అద్దం పడుతోంది. రేపు విడుదల కాబోతున్న టాక్సిక్ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. **- సహనం వందే, హైదరాబాద్**



టాక్సిక్ చిత్రంలో హీరో పాత్రతో పాటు విలన్ పాత్రను కూడా యష్ పోషిస్తున్నారు. కేవలం ఒకే రకమైన పాత్రలు చేస్తాడనే అపవాదును తొలగించుకోవడానికి యష్ తీసుకున్న ఈ నిర్ణయం నిజంగా సాహసోపేతమైనది. విమర్శకులు ఎప్పటికప్పుడు చేస్తున్న విమర్శలకు తన నటన ద్వారా సరైన సమాధానం ఇవ్వడానికి ఆయన ఈ ప్రయోగాన్ని ఎంచుకున్నారు.

నేడే విడుదల...

కన్నడ స్టార్ యష్ తాజా సినిమా టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్ ట్రైలర్ ఆగస్ట్ 8వ తేదీన విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాతో యష్ నటన మరో లెవెల్‌కు వెళ్తుందని అభిమానులు చర్చించుకుంటున్నారు. 4 సంవత్సరాల విరామం తర్వాత యష్ మళ్ళీ సిల్వర్ స్క్రీన్‌పైకి రాబోతున్నారు. ఈ భారీ చిత్రం మంగళవారం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలవుతోంది. కేజీఎఫ్ సినిమాలోని రాకీభాయ్ పాత్రతో చేతిలో సిగరెట్, స్టైలిష్ వాకింగ్, పవర్ ఫుల్ డైలాగ్స్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన యష్ కేవలం యాక్షన్‌కే పరిమితం కాదని నిరూపించనున్నారు.

కమర్షియల్ హంగులకు అతీతంగా నటన...

కేవలం స్టెప్పులు వేయడం, ఫైట్లు చేయడం, స్లో మోషన్‌లో నడవడమే కాకుండా ఒక సూపర్ స్టార్ అద్భుతమైన నటనను కూడా ప్రదర్శించగలడా అనే ప్రశ్న ఎప్పుడూ ఉంటుంది. ఒకప్పుడు ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా రజనీకాంత్ గురించి మాట్లాడుతూ ఆయన కేవలం స్టైల్ మీద బతుకుతారే తప్ప గ్రౌండెడ్ రోల్స్ చేయలేరని వ్యాఖ్యానించారు. అప్పుడు ఎంతో మంది సినీ ప్రముఖులు రజనీకాంత్ నటనను వెనకేసుకొచ్చారు. అలాగే, యష్ కూడా కేవలం కమర్షియల్ హంగులకే పరిమితం కాకుండా నటుడిగా తనను తాను ఎప్పుడూ నిరూపించుకుంటూనే ఉన్నారు.

స్క్రిప్ట్ వర్క్... టాక్సిక్ అంచనాలు

పెద్ద స్టార్స్‌గా మారిన తర్వాత కూడా స్క్రిప్ట్ మీద వారు పెట్టే హోమ్‌వర్క్ చాలా తక్కువ మందికే సాధ్యమవుతుంది. కేజీఎఫ్ సినిమా విజయవంతం వెనుక ప్రశాంత్ నీల్, హోంబాలే ఫిలిమ్స్‌తో పాటు యశ్ పడిన శ్రమ కూడా ఎంతో ఉంది. కేవలం తెరపై కనిపించడమే కాకుండా, ఆ సినిమా డైలాగ్స్ రాయడంలో... స్క్రిప్ట్ వర్క్‌లో యష్ ఎంతో ఇన్‌వాల్వ్ అయ్యారు. తన సహ రచయితలతో కలిసి ఆయన చేసిన మేధోమథనమే ఆ సినిమాను అంత పెద్ద స్థాయికి తీసుకెళ్లింది. టాక్సిక్ సినిమా యశ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమా కోసం ఆయన ఒకేసారి రెండు భిన్నమైన పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ చిత్రం ఇండియన్ సినిమా చరిత్రలో కొత్త రికార్డులను సృష్టిస్తుందో లేదో చూడాలి. ఏదేమైనా యష్ నటనను ఇష్టపడే ప్రతి ఒక్కరికీ ఈ సినిమా ఒక సరికొత్త దృశ్యకావ్యంగా నిలవడం ఖాయం.

మరాఠీ రాకుంటే మహారాష్ట్ర వీడాల్సిందే

ముంబై అహంకారం... డ్రైవర్లపై ప్రతాపం

- ఆటో డ్రైవర్లపై మహారాష్ట్ర ఉక్కుపాదం
- హిందీ మాట్లాడితే బయటికి పంపేస్తున్నారు
- గగ్గోలు పెడుతున్న ఉత్తర, దక్షిణాది డ్రైవర్లు
- ఉత్తరాది వర్సెస్ ఉత్తరాదిగా మారిన పరిస్థితి
- మళ్లీ ఊపందుకుంటున్న ప్రాంతీయ ఉద్యమం

ముంబై వీధుల్లో ఆటో, క్యాబ్ నడపాలంటే ఇకపై డ్రైవర్లకు కేవలం డ్రైవింగ్ లైసెన్స్ ఉంటే సరిపోదు, కచ్చితంగా స్థానిక మరాఠీ భాష వచ్చి ఉండాల్సిందేనన్న నిబంధనను మహారాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా అమలు చేస్తోంది. రవాణా శాఖ తీసుకున్న ఈ నిర్ణయం వెనుక ముంబైలో తిష్టవేసిన వలస డ్రైవర్ల దారుణ పరిస్థితి ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. **- సహనం వందే, ముంబై**

మహారాష్ట్ర మోటార్ వెహికల్స్ సవరణ నిబంధనల ప్రకారం ఆటో రిక్షా, ట్యాక్సీ డ్రైవర్లు అందరూ తప్పనిసరిగా మరాఠీ భాషా నైపుణ్యాన్ని కలిగి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ముంబై, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రంగాన్ని శాసిస్తున్న డ్రైవర్లలో సుమారు 70 శాతం మంది ఉత్తర, దక్షిణ భారతదేశం నుంచి వలస వచ్చినవారే కావడం గమనార్హం. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బిహార్, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి రాష్ట్రాల నుంచి ఉపాధి వెతుక్కుంటూ ముంబై నగరానికి వచ్చి ఆటోలు, క్యాబ్‌లు నడుపుతున్నారు. వీరిలో చాలామందికి జాతీయ హిందీ భాష మాత్రమే వచ్చు. వీరిని లక్ష్యంగా చేసుకునే ఈ నిబంధన తెరపైకి వచ్చిందనే విమర్శలు రాజకీయ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

రోడ్లపై ముమ్మర తనిఖీలు...

ఈ శిక్షణా కార్యక్రమం పూర్తి కావడానికి ఆగస్టు 15వ తేదీని తుది గడువుగా నిర్దేశించిన ప్రభుత్వం, ఆ గడువు ముగిసిన వెంటనే ఈనెల 20వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖాధికారులు విస్తృత తనిఖీలను ప్రారంభించి డ్రైవర్ల భాషా పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు, ఆర్టీవో మార్షల్స్ రోడ్లపై అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలను ఎంచుకుని ఈ తనిఖీలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ముంబైలోని రద్దీగా ప్రదేశాలలో ఆటో స్టాండ్‌ల వద్దకు నేరుగా వెళ్లి డ్రైవర్లతో ముఖాముఖి మాట్లాడి వారి మరాఠీ నైపుణ్యాన్ని పరీక్షిస్తున్నారు. కేవలం మూడు రోజుల తనిఖీల సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5211 మంది డ్రైవర్లను అధికారులు పరీక్షించగా, ఇందులో ఒక్క ముంబై నగరంలోనే 3942 మంది డ్రైవర్లను తనిఖీ చేయడం విశేషం.

పరీక్షా సరళి... డ్రైవర్లకు నోటీసులు

నోటీసులు అందుకుంటున్న వలసదారులు పరీక్షా సమయంలో అధికారులు డ్రైవర్లను ఎక్కడికి వెళ్ళాలి,మీటర్ స్టార్ట్ చేయండి,ఎంత సమయం పడుతుంది, చిల్లర ఉందా, డబ్బులు ఎలా చెల్లించాలి, క్యాష్ ఇవాలా ఆన్‌లైన్ చేయాలా, రిక్షా స్టాండ్ ఎక్కడ ఉంది వంటి రోజువారీ సంభాషణలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా మూడో రోజు నాటికి ప్రాక్టికల్ మరాఠీ భాష రాని 777 మంది డ్రైవర్లను అధికారులు గుర్తించారు. సరిగ్గా మరాఠీ మాట్లాడలేకపోయిన వీరందరికీ రవాణా శాఖ అధికారులు వెంటనే అధికారిక నోటీసులు జారీ చేసి, రాబోయే ఒక నెల రోజులలోపు మరాఠీ భాష నేర్చుకోవాలని గడువు విధించారు. అధికారిక గణాంకాల ప్రకారం మహారాష్ట్రలోని లక్షలాది మంది హిందీ మాట్లాడేవారిలో మెజారిటీ ప్రజలకు మరాఠీ భాషపై పట్టు లేకపోవడం లేదా రెండో భాషగా దాన్ని ఉపయోగించక పోవడం ఈ సంక్షోభం తీవ్రతను తెలియజేస్తోంది. ఇచ్చిన గడువు తర్వాత కూడా నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని రవాణా మంత్రి ప్రతాప్ సర్నాయక్ స్పష్టం చేశారు. స్థానిక అస్తిత్వం పేరుతో సాగుతున్న ఈ భాషా రాజకీయం ఉత్తరాది కార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లైసెన్సులు... బ్యాడ్జ్‌ల నిబంధనలు

మహారాష్ట్రలో ఇప్పటివరకు మొత్తం 9.65 లక్షల రిక్షా ట్యాక్సీ లైసెన్సులు, బ్యాడ్జ్‌లు జారీ చేశారు. ఒక్క ముంబై నగరంలోనే 4,62,387 రిక్షా, ట్యాక్సీ లైసెన్స్ హోల్డర్లు ఉన్నారు. ఇకపై కొత్తగా బ్యాడ్జ్‌లు జారీ చేసేటప్పుడు కూడా ఈ మరాఠీ పరీక్షను తప్పనిసరి చేశారు. డ్రైవర్‌కు మరాఠీపై పరిజ్ఞానం ఉందని పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే అతనికి కొత్త బ్యాడ్జ్ జారీ చేస్తామని మంత్రి తేల్చి చెప్పారు. ఈ తనిఖీ కార్యక్రమం సెప్టెంబర్ 30 వరకు నిరంతరం కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. మహారాష్ట్ర మోటార్ వెహికల్స్ రూల్స్ ప్రకారం పర్మిట్ల పునరుద్ధరణ కోసం మరాఠీ భాషా పరిజ్ఞానం ఉండటం చట్టబద్ధంగా తప్పనిసరి చేశారు.